

# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి**

**రేపు తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థికమంత్రి**

**ఫిబ్రవరి 9తో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలు**

**విభజన హామీలు అమలు చేయాలని కోరిన బీఆర్ఎస్**

న్యూఢిల్లీ, జనవరి 30: పార్లమెంట్‌లో మోదీ సర్కార్ చివరి బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. కాగా సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తిచేసింది. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం మరోసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపడుతుంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 9వ తేదీ వరకే కొనసాగనున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న జమ్ముకశ్మీర్ బడ్జెట్‌ను కూడా సీతారామన్ పార్లమెంట్ ప్రవేశపెడుతారని చెప్పారు. ఈ సమావేశాల ఎజెండాలో రాష్ట్రపతి ప్రసంగం, తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదన, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతలు పలు అంశాలను లేవనెత్తారు. నిరుద్యోగం, అధిక ద్రవ్యోల్బణం, వ్యవసాయరంగ సంక్షోభం, మణిపూర్‌లో హింస అంశాలను సభలో లేవనెత్తుతామని చెప్పారు. ప్రార్థనా స్థలాల చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సమాజ్‌వాదీ పార్టీ నేత ఎస్‌టీ హసన్ డిమాండ్ చేశారు. ప్రార్థనా స్థలాల చట్టం ప్రకారం 1947, ఆగస్టు 15 నాటికి ఆయా మతాల వారి స్వాధీనంలో ఉన్న ప్రార్థనా స్థలాలను యథాతథంగా కొనసాగించాలని, వారణాసిలోని జ్ఞానవాపి మసీదును హిందువులకు అప్పగించాలన్న వాదన ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో హసన్ ఈ డిమాండ్ చేశారు. వీటిపై ప్రహ్లాద్ జోషీ స్పందిస్తూ.. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు.

### తెలంగాణ వాణి బలంగా వినిపించాం: బీఆర్ఎస్

రాష్ట్ర విభజన చట్టంలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేయడంతో పాటు తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై గళం విప్పారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టం హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. కేంద్రం వద్ద ఎన్నో పెండింగ్ సమస్యలున్నాయని, వాటిపై ప్రతి లోక్‌సభ సమావేశాల్లోను ప్రస్తావించి, తెలంగాణ వాణిని ఎంతో బలంగా వినిపించామని అన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పెండింగ్ నిధులు, ప్రాజెక్టులు తదితర అన్ని పెండింగ్ అంశాలపై పెద్ద ఎత్తున పోరాటం చేశామని తెలిపారు. ఈ చివరి సమావేశాల్లో కూడా పెండింగ్ సమస్యలపై తమ గళాన్ని మరింత బలంగా వినిపిస్తామని వారు స్పష్టం చేశారు.

# సీఎంగా సొరేన్ భార్య?

**నేడు జార్ఖండ్ సీఎంను ప్రశ్నించనున్న ఈడీ**

**అరెస్టు చేసే పక్షంలో జేఎంఎం ప్లాన్-బీ సిద్ధం!**

**'అదృశ్యం' తర్వాత రాంచీ చేరుకొన్న హేమంత్**

**ఎమ్మెల్యేలతో సమావేశం.. భార్య కల్పన హాజరు**

**రాష్ట్రవ్యాప్తంగా అదనపు బలగాల మోహరింపు**

రాంచీ/న్యూఢిల్లీ, జనవరి 30: జార్ఖండ్‌లో రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. భూకుంభకోణం ఆరోపణలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ దర్యాప్తును వేగవంతం చేయడం, సీఎం హేమంత్ సొరేన్‌ను మరోసారి బుధవారం ప్రశ్నించేందుకు ఈడీ సిద్ధమవుతున్న నేపథ్యంలో అనేక వార్తలు షికారు చేస్తున్నాయి. అందులో ఒకవేళ ఈడీ హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేస్తే.. ఆయన భార్య కల్పనా సొరేన్‌కు సీఎం పగ్గాలు అప్పగిస్తారనేది ప్రధానమైనది. ఈ మేరకు అధికార జేఎంఎం 'ప్లాన్-బీ'ని ఇప్పటికే సిద్ధం చేసినట్టు సమాచారం. ఢిల్లీ వెళ్లిన తర్వాత కొన్ని గంటల పాటు అందుబాటులో లేని సీఎం హేమంత్ సొరేన్.. మంగళవారం రాంచీలో దర్శనమిచ్చారు. ఢిల్లీ నుంచి ఆయన రోడ్డు మార్గంలో వచ్చారని సొరేన్ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. వెంటనే ఆయన తన అధికారిక నివాసంలో జేఎంఎం, సంకీర్ణ ప్రభుత్వంలోని ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి కల్పనా సొరేన్ కూడా హాజరు కావడం.. రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సంబంధించిన జరుగుతున్న ప్రచారానికి బలం చేకూర్చింది. సంకీర్ణ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలందరూ రాంచీలోనే ఉండాలని ఆదేశాలు అందినట్టు సమాచారం.



మంగళవారం రాంచీలో తన మద్దతుదారులకు అభివాదం చేస్తున్న జార్ఖండ్ సీఎం సొరేన్

**అందుబాటులో లేకుండా పోయిన సొరేన్..**

ఈనెల 20న సొరేన్‌ను ఏడు గంటల పాటు ప్రశ్నించిన ఈడీ.. ఈ నెల 29 లేదా 31న మరోసారి అందుబాటులో ఉండాలని సమన్లు ఇచ్చింది. ఓ ప్రభుత్వ కార్యక్రమాన్ని రద్దు చేసుకొని మరీ సొరేన్ 27న రాత్రి ఢిల్లీకి వెళ్లారు. ఈ క్రమంలో ఆయన్ను ప్రశ్నించేందుకు ఈడీ బృందం సోమవారం ఢిల్లీలోని ఆయన ఇంటి వద్దకు వెళ్లగా.. అందుబాటులో లేరని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు రూ.36 లక్షల నగదు, ఒక బీఎండబ్ల్యూ కారు, పలు పత్రాలను సీజ్ చేసినట్టు వెల్లడించిన విషయం తెలిసిందే. రాజకీయ అజెండాతో ప్రేరేపితం అయినట్టుగా ఈడీ చర్యలు ఉన్నాయని హేమంత్ సొరేన్ గత ఆదివారం ఈడీకి పంపిన మెయిల్‌లో ఆరోపించారు. రాంచీలోని తన నివాసంలో ఈనెల 31న తన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపారు. కాగా, అరెస్టు భయంతోనే సొరేన్ పారిపోయారంటూ బీజేపీ విమర్శలు చేసింది. తమ నేత ఎవరికీ భయపడబోరని, బీజేపీ, ఈడీ కలిసి కుట్రలు చేస్తున్నాయని జేఎంఎం అధికార ప్రతినిధి సుప్రియో భట్టాచార్య అన్నారు.

**సీఎస్, డీజీపీలతో గవర్నర్ భేటీ**

మరోవైపు రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సీఎస్, డీజీపీలను రాజ్‌భవన్‌కు పిలిపించుకొని మాట్లాడటం కూడా ప్రాధాన్యం సంతరించుకొన్నది. సమావేశం అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణ కోసం విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. 7 వేల మంది అదనపు పోలీసు సిబ్బందిని మోహరించామని తెలిపారు. రాంచీలోని సీఎం సొరేన్ నివాసం, రాజ్‌భవన్, ఈడీ కార్యాలయంతో సహా పలు ఏరియాల్లో నిషేధాజ్ఞలు విధించినట్టు అధికారులు వెల్లడించారు.

**గతంలో తండ్రి శిబు కూడా..!**

గతంలో హేమంత్ తండ్రి శిబు సొరేన్ కూడా ఓసారి ఇలాగే కొన్ని రోజుల పాటు కనిపించకుండా పోయారు. 2004లో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో శిబు సొరేన్‌పై అరెస్టు వారెంట్ జారీ అయింది. కొన్ని దశాబ్దాల క్రితం జార్ఖండ్‌లోని చిరుదిలో జరిగిన ఘర్షణల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలో ఆయన్ను అరెస్టు చేయాలని కోర్టు ఆదేశించింది. వారెంట్ జారీ తర్వాత కనిపించకుండా పోయిన శిబు సొరేన్ కోసం పోలీసు బృందాలు జార్ఖండ్, ఢిల్లీల్లో విస్తృతంగా గాలించాయి. చివరకు 10 రోజుల తర్వాత ప్రత్యక్షమైన రాంచీలో ప్రత్యక్షమైన ఆయన.. తాను ఎక్కడికీ పారిపోలేదని, జార్ఖండ్ అడవుల్లో ఉన్న గ్రామాలకు వెళ్లానని అప్పుడు చెప్పడం గమనార్హం.

## చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో హైడ్రామా

**మేయర్ పదవి బీజేపీ కైవసం • బీజేపీకి 16, ఆప్‌కు 12 ఓట్లు • 8 చెల్లని ఓట్లు**

**బ్యాలెట్ పేపర్లు ట్యాంపరింగ్ చేశారని ఆప్, కాంగ్రెస్ ఆరోపణలు**

చండీగఢ్, జనవరి 30: పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు మంగళవారం జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో భారీ హైడ్రామా నడిచింది. బ్యాలెట్ పేపర్ల ట్యాంపరింగ్ ఆరోపణల నడుమ మేయర్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మనోజ్ సోన్కర్‌ను ప్రిసైడింగ్ అధికారి విజేతగా ప్రకటించారు. మొత్తం 36 ఓట్లు పోలవగా.. బీజేపీ అభ్యర్థికి 16 ఓట్లు, ఆప్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌కు 12 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఎనిమిది ఓట్లను చెల్లనివిగా ప్రకటించారు. ప్రిసైడింగ్ అధికారి బ్యాలెట్ పేపర్ల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆందోళనకు దిగారు. మేయర్ ఎన్నిక ప్రకటన తర్వాత.. చేపట్టిన సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలను బహిష్కరించారు. దీంతో ఆ రెండు పోస్టులు కూడా బీజేపీకే వెళ్లాయి.

**బీజేపీకి అనుకూలంగా ప్రిసైడింగ్ అధికారి!**

ఏకంగా ఎనిమిది ఓట్లను చెల్లనివిగా ప్రకటించడంపై ఆప్, కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇందులో కుట్ర ఉన్నదని, ప్రిసైడింగ్ అధికారి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ బ్యాలెట్ పేపర్ల ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని విపక్ష కౌన్సిలర్లు ఆరోపించారు. కౌంటింగ్ సమయంలో బ్యాలెట్ పేపర్లపై కొన్ని గుర్తులు రాసి చెల్లనివిగా ప్రకటించారని అన్నారు. కౌంటింగ్ కోసం బ్యాలెట్ బాక్స్‌ను తెరిచే సమయంలో తమ పార్టీ ఏజెంట్‌ను కనీసం పిలువలేదని కాంగ్రెస్ కౌన్సిలర్ గుర్బాక్స్ రావత్ అన్నారు. ప్రిసైడింగ్ అధికారి పాల్పడిన బ్యాలెట్ పేపర్ల ట్యాంపరింగ్ వ్యవహారం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆరోపిస్తూ ఆప్, కాంగ్రెస్ ఒక వీడియో విడుదల చేశాయి. ఆప్, కాంగ్రెస్ సభ్యుల ఆరోపణలను బీజేపీ కొట్టిపారేసింది. విపక్ష కౌన్సిలర్లకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఫలితాన్ని సవాల్ చేసుకోవచ్చని బీజేపీ కౌన్సిలర్ సౌరభ్ జోషి అన్నారు. కాగా, ఆప్ పంజాబ్-హర్యానా హైకోర్టును ఆశ్రయించింది. మేయర్ ఎన్నికల ఫలితాన్ని పక్కనపెట్టి, రిటైర్డ్ హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో మరోసారి ఎన్నికలు నిర్వహించాలని కోరింది. ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉన్నది.

**ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజు**

మేయర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్టు స్పష్టమౌతున్నదని ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. ఈ ఎన్నికల్లోనే ఇలా చేశారంటే, లోక్‌సభ ఎన్నికల్లో వారు(బీజేపీ) ఎంత వరకైనా వెళ్తారనే దానికి ఇదే ఉదాహరణ అని అన్నారు. ఇది 'ప్రజాస్వామ్యానికి చీకటి రోజు' అని పేర్కొన్నారు.

### మైన్‌పురి నుంచి డింపుల్ పోటీ

**యూపీలో 16 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఎస్పీ**



లక్నో, జనవరి 30: యూపీలో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసే 16 మంది అభ్యర్థుల మొదటి జాబితాను సమాజ్‌వాది పార్టీ మంగళవారం ప్రకటించింది. మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ సతీమణి, ప్రస్తుత ఎంపీ డింపుల్ యాదవ్.. మైన్‌పురి నుంచి పోటీచేయనున్నారు. ఒక పక్క సీట్ల షేరింగ్‌పై కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్న క్రమంలో ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మొదటి జాబితాను విడుదల చేయడం గమనార్హం. తమ పార్టీకి ఏది మంచిదని భావిస్తామో దానినే అమలు చేస్తామని, దానికి కాంగ్రెస్ అనుమతి అక్కర్లేదని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఆరు సీట్ల కేటాయింపుపై కాంగ్రెస్ చూపిన నిర్లక్ష్య వైఖరికి ప్రతీకారంగానే అఖిలేశ్ ఈ చర్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు.



### రాజ్యసభకు చండీగఢ్ వర్సిటీ వ్యవస్థాపక చాన్సలర్

**సత్నామ్‌సింగ్ నామినేట్**

న్యూఢిల్లీ: చండీగఢ్ యూనివర్సిటీ వ్యవస్థాపక చాన్సలర్ సత్నామ్‌సింగ్ సంధూ మంగళవారం రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఆయనను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేసినట్టు కేంద్ర హోం శాఖ తెలిపింది. ఓ రైతు ఇంట జన్మించిన సంధూ చదువు కోసం ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని దేశంలోని ప్రముఖ విద్యావేత్తగా ఎదిగినట్టు పేర్కొంది. మొహాలీలోని లాండ్రన్‌లో 2001లో చండీగఢ్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌ను, 2012లో చండీగఢ్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని వివరించింది. ప్రజల ఆకాంక్షలు వినిపించే అవకాశం కల్పించారంటూ ప్రధాని మోదీకి సంధూ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

### ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేత

న్యూఢిల్లీ, జనవరి 30: పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 14 మంది ప్రతిపక్ష ఎంపీలపై ఉన్న సస్పెన్షన్‌ను మంగళవారం ఎత్తివేశారు. రాజ్యసభలో 11 ప్రతిపక్ష ఎంపీలపై చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ ఎత్తేయగా, లోక్‌సభలో ముగ్గురు ఎంపీలపై స్పీకర్ ఓం బిర్లా సస్పెన్షన్ తొలగించారు. 14 మంది ఎంపీల సస్పెన్షన్ తొలగించాలని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి ఉభయ సభాపతులు అంగీకరించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ తెలిపారు.

### 'డీ-రిజర్వేషన్'పై యూజీసీ వెనక్కి

**మార్గదర్శకాల ముసాయిదా తొలగింపు**

న్యూఢిల్లీ, జనవరి 30: వివాదాస్పద డీ-రిజర్వేషన్‌పై యూజీసీ తన ప్రతిపాదనను వెనక్కి తీసుకుంది. దీనికి సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాల ముసాయిదాను మంగళవారం తన వెబ్‌సైట్ నుంచి తొలగించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన రిజర్వ్‌డ్ కేటగిరీలో అభ్యర్థులు దొరక్కపోతే ఆ స్థానాన్ని అన్ రిజర్వ్‌డ్ క్యాటగిరీగా ప్రకటించవచ్చని యూజీసీ గత ఆదివారం విడుదల చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్ విధానాన్ని ఎత్తివేయడానికే ఈ ప్రతిపాదన తెచ్చారంటూ కాంగ్రెస్ మండిపడింది.

# సముద్రపు దొంగలకు సింహస్వప్నం

**అరేబియా సముద్రంలో పైరేట్ల ఆటకట్టిస్తున్న ఇండియన్ నేవీ**

**మూడ్రోజుల్లో మూడు హైజాక్ నౌకలను రక్షించిన కమెండోలు**

న్యూఢిల్లీ, జనవరి 30: సముద్రపు దొంగల గుండెల్లో ఇండియన్ నేవీ రైళ్లు పరిగెత్తిస్తున్నది. అరేబియా సముద్రంలో తరచూ నౌకలను హైజాక్ చేస్తున్న పైరేట్ల ఆటకట్టిస్తున్నది. ఇండియన్ నేవీ అంటేనే వారు హడలెత్తిపోతున్నారు. గత మూడు రోజుల వ్యవధిలో హైజాక్‌కు గురైన వివిధ దేశాలకు చెందిన మూడు నౌకలను భారత నావికాదళం కాపాడింది. 19 మంది పాకిస్థాన్, 17 మంది ఇరాన్ సిబ్బందిని మన మార్కోస్ కమెండోలు తమ వీరోచిత ఆపరేషన్‌తో రక్షించారు. అలాగే శ్రీలంక మొగదీసు తూర్పు తీరంలో హైజాక్ అయిన చేపల నౌకను మన నేవీ సిబ్బంది, శ్రీలంక సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు.



సోమాలియా సముద్రపు దొంగల చెర నుంచి పాకిస్థాన్ సిబ్బందిని రక్షించడానికి రంగంలోకి దిగిన భారత నేవీ హెలికాప్టర్

**డేరింగ్ ఆపరేషన్..**

ఇరాన్ జెండాతో వస్తున్న ఒక చేపల నౌకను సముద్రపు దొంగల నుంచి ఇండియన్ నేవీ సోమవారం రక్షించింది. సోమాలియా తూర్పుతీరంలో ఈ బోటుపై సోమవారం 11 మంది సాయుధులైన సోమాలియా సముద్రపు దొంగలు దాడి చేశారు. ఎడెన్ గల్ఫ్, తూర్పు సోమాలియా సముద్ర జలాల్లో ఉన్న మన యుద్ధనౌక ఐఎన్ఎస్ సుమిత్రాకు ఈ సమాచారం అందడంతో హుటాహుటిన చేపలు పట్టే నౌక అల్ నయీమీ వద్దకు చేరుకుని హెలికాప్టర్ సాయంతో సముద్రపు దొంగలను తరిమికొట్టి అందులోని 19 మంది పాకిస్థాన్ సిబ్బందిని రక్షించింది. అలాగే ఆదివారం ఎఫ్‌వీ ఇమాన్ అనే ఇరాన్ నౌకపై సముద్రపు దొంగలు దాడి చేయగా వెంటనే స్పందించి సముద్రపు దొంగల ఆట కట్టించి 17 మంది ఇరాన్ సిబ్బందిని కాపాడింది. అలాగే తూర్పు మొగాదిషులో శ్రీలంక నౌకను శనివారం ముగ్గురు పైరేట్లు హైజాక్ చేయగా భారత్ నేవీ రంగంలోకి దిగింది. శ్రీలంక నేవీతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి నౌకను విడిపించింది. గత 36 గంటల్లో అరేబియా సముద్రంలో మొత్తం 36 మంది సిబ్బందిని భారత నేవీ రక్షించింది.

**ఏమిటీ మార్కోస్ దళం?**

మార్కోస్.. ఈ పేరెత్తితే చాలు.. సముద్రపు దొంగలు హడలెత్తిపోతారు. భారత్‌లోని అతి శక్తివంతమైన ఎనిమిది కమాండో దళాల్లో మార్కోస్ ఒకటి. 1987లో ఏర్పాటైన ఈ దళంలో సుశిక్షితులైన సిబ్బంది ఉంటారు. యూఎస్ నేవీ సీల్స్ మాదిరిగా రూపొందిన వీరు వివిధ రంగాల్లో అత్యున్నత శిక్షణ పొందడంతో పాటు అన్ని రకాల అడ్వాన్స్‌డ్ ఆయుధాల ప్రయోగంలో ఆరితేరారు. మిగతా దళాలకు, దీనికి తేడా ఏమిటంటే ప్రతికూల వాతావరణం, పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటారు. నీరు, నేల, నింగి ఇలా ఏ వైపు నుంచి వచ్చే విపత్తులైనా ఎదుర్కొనే సత్తా వీరి సొంతం. అవసరమైనప్పుడు భారత ఆర్మీతో సమన్వయం చేసుకుంటూ సునిశిత ప్రదేశాలలో వారితో కలిసి సంయుక్త ఆపరేషన్లు చేపడతారు. భయమంటే ఏమిటో తెలియని ధీరులుగా వీరిని అభివర్ణిస్తారు. తుఫాన్ లాంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కూడా వీరి సేవలను వినియోగిస్తారు. అలాగే 26/11 ముంబై ఉగ్రదాడిలో, శ్రీలంకలో ఎల్టీటీఈ తీవ్రవాదుల అణచివేతలో కూడా వీరు తమ సేవలందించారు.

### మైనర్‌పై గ్యాంగ్‌రేప్.. ముగ్గురికి 90 ఏండ్ల జైలు

ఇడుక్కి (కేరళ), జనవరి 30: బాలికపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులకు కేరళలోని పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. ఒక్కొక్కరికి 90 ఏండ్ల చొప్పున జైలు శిక్ష ఖరారు చేసింది. బెంగాల్‌కు చెందిన వలస కూలీలు ఇడుక్కి జిల్లాలో పనిచేయడానికి 2022లో వచ్చారు. అప్పుడు ముగ్గురు వ్యక్తులు ఓ వలస కూలీ కుమార్తెపై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. ఈ కేసును విచారించిన పోక్సో కోర్టు తాజాగా శిక్షలు ఖరారు చేసింది.

### మణిపూర్‌లో మళ్లీ హింస

**కాల్పుల్లో ఇద్దరు మృతి**

ఇంఫాల్: మణిపూర్‌లో హింస కొనసాగుతున్నది. మంగళవారం ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కౌట్రక్ గ్రామంలో రెండు బృందాల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. మరొకరు కనిపించకుండా పోయారు. ఈ ఘటనలో బీజేపీ యువ మోర్చా మాజీ అధ్యక్షుడు మనోహర్ మయుమ్ బరిష్ శర్మ గాయపడ్డారు. ఇంఫాల్ పశ్చిమ, కాంగ్‌పోక్పీ జిల్లాల సరిహద్దులో రెండు వర్గాల గ్రామ వలంటీర్ల మధ్య ఈ కాల్పులు జరిగాయి. తాజా హింసాత్మక ఘటనల వల్ల కడంగ్‌బంద్, కౌట్రక్, కంగ్‌చుప్ గ్రామాల ప్రజలు పారిపోయారు. ఆదివారం రెండు గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక గ్రామ వలంటీర్ మరణించగా, నలుగురు గాయపడ్డారు. 60 వేలకు పైగా కేంద్ర భద్రతా దళాలను మోహరించినా ఇంకా హింస ఎందుకు కొనసాగుతున్నదని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

# 15 మందికి ఉరిశిక్ష

**బీజేపీ నేత హత్య కేసులో కేరళ కోర్టు సంచలన తీర్పు**

అలప్పుజా (కేరళ), జనవరి 30: బీజేపీ నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో నిషేధిత ఇస్లామిక్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులైన 15 మందికి కేరళ కోర్టు ఉరిశిక్ష విధించింది. దోషులు అందరూ 'శిక్షణ పొందిన కిల్లర్ స్క్వాడ్' అని, కన్నతల్లి, భార్య బిడ్డల ఎదుటే బాధితుడిని క్రూరంగా చంపడం అత్యంత అరుదైన నేరాల పరిధిలోకి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. కేరళ చరిత్రలో ఒకేసారి ఇంత మంది దోషులకు కోర్టు ఉరిశిక్ష విధించడం సంచలనంగా మారింది. బీజేపీ ఓబీసీ మోర్చా కేరళ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసన్‌ను అలప్పుజా జిల్లాలోని తన నివాసంలోనే 2021 డిసెంబర్ 19న కుటుంబసభ్యుల కండ్ల ఎదుటనే అత్యంత దారుణంగా చంపేశారు. ఈ హత్య ఘటనలో పీఎఫ్ఐతోపాటు సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన కార్యకర్తలు పాలుపంచుకున్నారు. కోర్టులో నేరం రుజువు కావడంతో దోషులైన 15 మందికి మరణ శిక్ష విధిస్తూ మవెలిక్కర అదనపు జిల్లా జడ్జి వీజీ శ్రీదేవి మంగళవారం తీర్పు వెలువరించారు. దోషుల్లో నైసమ్, అజ్మల్, అనూప్, అస్లమ్, అబ్దుల్ కలామ్, సలామ్, సఫారుద్దీన్, మన్సద్, జసీబ్ రాజా, నవాస్, సమీర్, నాజిర్, జాకీర్ హుస్సేన్, షాజీ పూవతుంగల్, షెర్నాస్ అష్రఫ్ ఉన్నారు. తొలి ఎనిమిది మంది దోషులు హత్య ఘటనలో నేరుగా పాలుపంచుకోగా, మిగతా వారు హతుడి ఇంటి ఎదుట ఆయుధాలతో నిఘా పెట్టారు.

# అమెరికాలోనే హెచ్-1బీ రెన్యువల్

- **అందుబాటులోకి పైలట్ ప్రోగ్రామ్**
- **మొదటి దశలో 20 వేల వీసాల పునరుద్ధరణ**
- **భారతీయులు, కెనడియన్లకు ఫస్ట్ చాన్స్**




వాషింగ్టన్: ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లే వారికి వీసా రెన్యువల్ విషయంలో ఎదురయ్యే కష్టాలు ఇకపై తప్పనున్నాయి. హెచ్-1బీ వీసా రెన్యువల్ విధానాన్ని మరింత సరళీకరిస్తూ అమెరికా తీసుకొన్న నిర్ణయం అమల్లోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఈ నెల 29 నుంచి ఈ ప్రోగ్రామ్ ప్రారంభమైందని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. దీంతో భారత్ సహా ఇతర దేశాలకు చెందిన వృత్తి నిపుణులు ఇకపై అమెరికాలో తమ గడువు తీరిన వీసాలను అక్కడే రెన్యువల్ చేసుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా 20 వేల వీసాలను అమెరికాలోనే రెన్యువల్ చేయనున్నారు. తొలి దశ డ్రైవ్‌లో ఈ అవకాశాన్ని కేవలం భారతీయులు, కెనడియన్లకు మాత్రమే కల్పించారు. ఐదు వారాలు కొనసాగే ఈ వీసా రెన్యువల్ కార్యక్రమంలో ప్రతి వారం 4 వేలు చొప్పున వీసాలను ఇమ్మిగ్రేషన్ అధికారులు రెన్యువల్ చేయనున్నారు. 2021, ఫిబ్రవరి 1 నుంచి 2021, సెప్టెంబర్ 30 మధ్య మిషన్ ఇండియా జారీ చేసిన వీసాలను మాత్రమే రెన్యువల్ చేసుకొనేందుకు వీలు కల్పించారు.

▶ మొదటిపేజీ తరువాయి...

# ఇస్మార్ట్ 'చిప్'!


న్యూరాలింక్ వ్యవస్థాపకుడు, ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మంగళవారం వెల్లడించారు. 'మనిషి మెదడులో చిప్ ప్రవేశపెట్టాం. దీని ద్వారా న్యూరాన్ల కదలికలను గుర్తించాం' అని ఆయన ట్వీట్ చేశారు. చిప్ అమర్చిన వ్యక్తి వేగంగా కోలుకుంటున్నట్టు, తొలి ఫలితాల్లో స్పష్టమైన 'న్యూరాన్ స్పైక్ డిటెక్షన్'ను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ చిప్‌నకు 'ఎన్1(లింక్)'గా నామకరణం చేశారు.

**ఏమిటీ ఎన్1?**

మనిషి మెదడు, వెన్నెముక సంబంధ సమస్యలపై అధ్యయనం చేయడం, పక్షవాతం వచ్చిన మనిషి కంప్యూటర్ సాయంతో అవసరమైన పనులు నిర్వర్తించడం కోసం తీసుకొచ్చిందే చిప్ 'ఎన్1'. ఈ చర్యలను 'ప్రిసైజ్ రోబోటికల్లీ ఇంప్లాంటెడ్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (ప్రైమ్)'గా పిలుస్తున్నారు.

**ఎలా పనిచేస్తుందంటే..**

మెదడులో అమర్చే ఎన్1 చిప్ 8 మిల్లీమీటర్ల వ్యాసం కలిగి ఉంటుంది. వెంట్రుకలో 20వ వంతు మందం ఉండే సన్నటి దారాల్లాంటి ఎలక్ట్రోడ్లు ఈ చిప్‌లో ఉంటాయి. పుర్రెలో చిన్న భాగాన్ని తొలగించి మెదడుకు ఈ సాధనాన్ని అమరుస్తారు. ఈ చిప్‌నకు ఉండే 3 వేలకు పైగా సన్నటి ఎలక్ట్రోడ్లను మెదడులోకి చొప్పిస్తారు. వాటిని మెదడులోని ముఖ్యమైన భాగాలకు చేరువగా ప్రవేశపెడతారు. అవి సుతిమెత్తగా ఉంటూ అటూఇటూ వంగేలా ఉంటాయి. ఎలక్ట్రోడ్లు.. మెదడులోని న్యూరాన్ల మధ్య ప్రసారమవుతున్న సందేశాలను గుర్తించి చిప్‌నకు పంపుతాయి. ఒక చిప్‌లోని ఎలక్ట్రోడ్లు వెయ్యి న్యూరాన్ల చర్యలను పరిశీలిస్తాయి. మొత్తం మీద ఒక వ్యక్తిలోకి 10 చిప్‌లను ప్రవేశపెట్టొచ్చు. ఇలా మెదడు కదలికల సిగ్నల్స్‌ను రికార్డు చేసిన ఈ చిప్.. వైర్‌లెస్‌గా ఓ యాప్‌నకు ఆ వివరాలను చేరవేస్తుంది. మెదడు ద్వారా ఆలోచిస్తూ కంప్యూటర్ మౌస్ కర్సర్‌ను కదలించేలా, కీబోర్డు అక్షరాలను ఎంటర్ చేసేలా ప్రాథమికంగా పరిశోధనలు చేయనున్నారు.



**నాలుగు నెలల్లోనే..**

కంప్యూటర్‌తో మానవ మెదడు నేరుగా సమన్వయం చేసుకొనే 'బ్రెయిన్ -కంప్యూటర్ ఇంటర్‌ఫేస్' ప్రయోగాలకు అమెరికాలోని ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ(ఎఫ్‌డీఐ) గత ఏడాది మేలో ఆమోదం తెలిపింది. న్యూరాలింక్ అభివృద్ధి చేసిన ఈ చిప్‌ను ఇప్పటికే పందులు, కోతుల్లో విజయవంతంగా పరీక్షించారు. ఈ సాధనం అత్యంత సురక్షితమైనదని, విశ్వసనీయమైందని వెల్లడైనట్లు న్యూరాలింక్ ప్రతినిధులు తెలిపారు. ఈ చిప్ సాయంతో ఒక కోతి వీడియో గేమ్‌ను కూడా ఆడినట్టు వెల్లడించారు. అయితే, మనుషుల మెదడుకు ఈ చిప్‌ను అమర్చి, ట్రయల్స్ నిర్వహించేందుకు న్యూరాలింక్‌కు గత సెప్టెంబర్‌లోనే అనుమతులు వచ్చాయి. దీంతో నాలుగు నెలల రికార్డు సమయంలోనే ఈ ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించినట్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఉపయోగాలేంటి?

- నాడీ సమస్యలు, వెన్నుపూసకు గాయాలు, పక్షవాతం వల్ల కాళ్లు, చేతులు పూర్తిగా లేదా పాక్షికంగా చచ్చుబడ్డ రోగుల్లో స్పర్శ, కదలికలను ఏఐ (కృత్రిమ మేధ) ఆధారంగా ఈ చిప్ సాయంతో మెరుగుపరిచే అవకాశమున్నది. ఈ చిప్ సాయంతో పక్షవాతం వచ్చినవాళ్లు కూడా స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లను సులభంగా ఉపయోగించగలుగుతారు.
- మెదడు ఆదేశాల మేరకు శరీరంలోని అవయవాల పనితీరు ఆధారపడి ఉండటంతో.. మెదడు ఆదేశాలు అందక చచ్చుబడిపోయిన అవయవాలను కూడా ఈ చిప్ సాయంతో సిగ్నల్స్ పంపి తిరిగి పనిచేయించవచ్చు.
- డిమెన్షియా, పార్కిన్‌సన్స్, అల్జీమర్స్ వంటి మానసిక సమస్యల చికిత్స కోసం ఈ చిప్‌ను వాడొచ్చని నిపుణులు చెబుతున్నారు.
- అవసరమైన ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను మెదడులోని చిప్‌లోకి డౌన్‌లోడ్ చేసుకుని.. కంటిచూపు, వినికిడి వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చని పేర్కొంటున్నారు.
- ఈ చిప్ సాయంతో హార్మోన్ స్థాయిని నియంత్రించొచ్చని, కుంగుబాటును దూరం చేసుకోవచ్చని కూడా పరిశోధకులు చెబుతున్నారు.
- స్మార్ట్‌ఫోన్స్, కంప్యూటర్స్‌ను తాకకుండానే చిప్ సాయంతో ఆపరేట్ చేసే అవకాశమున్నది.